॥ శ్రీహరిః ॥

965

# దశావతారములు

## दशावतार ( तेलुगु )



GITA PRESS, GORAKHPUR

గీతాప్రెస్, గోరఖ్‌పూర్

Scanned with CamScanner

# 1. మత్స్యావతారము

పూర్వకాలమున 'సత్యవ్రతుడు' అను రాజు గలడు. అతడు గొప్ప ఉదారస్వభావము గలవాడు, గొప్ప దైవభక్తుడు. ఒకనాడు అతడు 'కృతమాలా'నదిలో తర్పణములను విడుచుచుండెను. అప్పుడు అతనిదోసిలి లోనికి ఒక చిన్న చేపపిల్ల వచ్చెను. అది తనను రక్షింపుమని అడుగుచుండెను. ఆ చేపమాటలను విని, రాజు దానిని తనకమండలమునందు చేర్చుకొని ఆశ్రమమునకు వెళ్ళెను. అది కమండలములో పట్టనంతపెద్దదిగా ఎదిగెను. అంతట దానిని ఒకకుండలో ఉంచుట జరిగెను. కొన్నినిమిషములకు కుండలోగూడ పట్టనంత పెద్దదిగా ఆచేప ఎదిగెను. పిమ్మట సత్యవ్రతమహారాజు దానిని ఒకసముద్రములో వదలుటకు నిశ్చయించుకొనెను. సముద్రమున విడిచిపెట్టుసమయమున ఆ చేప "రాజా! సముద్రములో పెద్దపెద్ద మొసళ్ళు ఉండును. కనుక నన్ను సముద్రములో విడిచిపెట్టవలదు." అని పలికెను. చేపయొక్క ఈ మధురవచనములకు మహారాజు మోహితుడయ్యెను. ఇది అంతయును 'మత్స్యభగవానునిలీల' అని తెలిసికొని, రాజు చేతులుజోడించి, ప్రార్థింపసాగెను.

అంతట మత్స్యభగవానుడు తనభక్తుడైన సత్యవ్రతునితో ఇట్లు పలికెను. "సత్యవ్రతా! నేటికి ఏడవ రోజున మూడులోకములును ప్రళయకాలజలరాశిలో మునిగిపోవును. ఆ సమయమున నాప్రేరణచే నీయొద్దకు ఒక పెద్దనావ రాగలదు. నీవు సకలజీవులను, మొక్కలను, ఆహారధాన్యములను తీసికొని, సప్త ఋషులతోగూడి, ఆ నావమీదికిఎక్కి బయలుదేఱుము. గొప్ప ప్రళయకాల మారుతము (గాలివాన) కారణమున ఆనావ తికమకలపాలైనప్పుడు నేను ఈ చేపరూపముతోనే మిమ్ములను అందఱిని రక్షింతును." రాజుతో ఆస్వామి ఇట్లు పలికి అంతర్ధానమయ్యెను.

ఇంతలో ఆప్రళయకాలము రానేవచ్చెను. సత్యవ్రతుడు చూచుచుండగనే భూమిఅంతయును నీటిలో మునిగిపోసాగెను. అప్పుడు ఆరాజునకు భగవంతుడుపల్కిన మాటలు జ్ఞప్తికి వచ్చెను. ఇంతలో నావగూడ అతనికడకు వచ్చెను. వెంటనే అతడు ఆహారధాన్యములను తీసికొని, సప్తఋషులతోపాటు ఆనావలోనికి ఎక్కెను. ఋషులఆజ్ఞప్రకారము రాజు భగవంతుని ధ్యానించెను. అదేసమయమున ఆ మహా సముద్రమునందు మత్స్యరూపమున భగవంతుడు ప్రకటితుడాయెను. అనంతరము భగవంతుడు ప్రళయ కాలసముద్రమున నావలో ఉన్న సత్యవ్రతునకు జ్ఞాన, భక్తి యోగములను ఉపదేశించెను.

హయగ్రీవుడు అను ఒకరాక్షసుడు కలడు. అతడు బ్రహ్మముఖమునుండివెలువడిన వేదములను అపహరించి, పాతాళమున దాగికొనెను. అప్పుడు భగవంతుడు మత్స్యరూపములో ఆ హయగ్రీవుని చంపి, వేదములను ఉద్ధరించెను.

సకలజగత్తునకును మూలకారణుడైన మత్స్యభగవానునకు మేము నమస్కరించుచున్నాము.

**శ్లో॥వాసవారిజంపి, వానిచేపడియున్న వేదకోటి చిక్కువిచ్చి తెచ్చి,**
**నిదురమానియున్న నీరజాసనునకు, ఇచ్చె కరుణతోడ ఈశ్వరుండు.**



Scanned with CamScanner



Scanned with CamScanner

# 2. కూర్మావతారము

ఇది చాలాకాలముక్రిందట జరిగినవిషయము. దేవతలకును రాక్షసులకును మధ్య వైరభావములు పెఱిగియుండెను. రెండుపక్షములవారును ఘోరముగా పోరాడిరి. రాక్షసులదురాక్రమణచేత దేవతలు మిగుల భీతిల్లిరి. వెంటనే వారు పరుగుపరుగున బ్రహ్మలోకమునకు చేరిరి. బ్రహ్మదేవునిసూచనను అనుసరించి, వారు జగన్నాథుడైనవిష్ణువును శరణుజొచ్చి, ఆయనను ప్రార్థించిరి. అప్పుడు ఆ విష్ణువు వారి మొఱ ఆలకించి, ప్రసన్నుడై వారితో ఇట్లనెను. "దేవతలారా! మీరు దానవులరాజైన బలిచక్రవర్తిని ఆదరముతో కలిసికొనుడు. అతనిని నాయకునిగాభావించి, సముద్రమును చిలుకుటకు సిద్ధముకండు. దానివలన మీకు అమృతము లభించును. ఆ అమృతమును త్రాగి, మీరు అమరులు అయ్యెదరు." అని పలికి భగవంతుడు అంతర్ధాన మయ్యెను.

అనంతరము దేవతలు బలిచక్రవర్తిని తమనాయకునిగా జేసికొనిరి. పిమ్మట వారు 'వాసుకి' అను సర్పమును త్రాడుగను, 'మందర'గిరిని కవ్వముగను చేసికొనిరి. రాక్షసులతోగూడి పాలసముద్రమును మథింపసాగిరి. వారు అట్లు క్షీరసాగరమును చిలుకుచుండగా మందరాచలము సముద్రమున మునిగిపోసాగెను. అప్పుడు ఆదేవదానవులు దిక్కుతోచని స్థితిలో భగవంతుని ప్రార్థించిరి. భగవంతునకు అన్నివిషయములును తెలియును. ఆయన నవ్వుచు ఇట్లనెను. "ఏదైనను ఒకకార్యమును ప్రారంభించుటకు ముందు గణేశుని పూజింపవలెను. ఆయనను ఆరాధింపనిదే ఏకార్యమైనను సిద్ధింపదు." ఆ మాటలను విని, అందఱును గణనాథుని పూజింపసాగిరి. ఒకవైపు వినాయకునిపూజ జరుగుచుండగా మఱియొకవైపు విష్ణుమూర్తి కూర్మావతారమును ఎత్తి (తాబేలురూపమును ధరించి) మందరాచలమును తనవీపునధరించి, అవలీలగా దానిని పైకెత్తెను.

పిమ్మట మఱల క్షీరసాగరమథనము మొదలయ్యెను. చాలాకాలము గడచినను అమృతము లభింపలేదు. అప్పుడు భగవానుడు వేయిచేతులనుదాల్చి, రెండుపక్షములయందును తానై నిలిచి చిలుకసాగెను. అప్పుడు సముద్రమునుండి 'హాలాహల' విషము బయటికి వచ్చెను. దానిని త్రాగి పరమశివుడు నీలకంఠుడు అయ్యెను.

ఈ విధముగా పాలసముద్రమునుండి వరుసగా కామధేనువు, 'ఉచ్చైశ్రవము' అను గుఱ్ఱము, 'ఐరావతము' అను ఏనుగు, కౌస్తుభమణి, కల్పవృక్షము, అప్సరసలు, లక్ష్మీదేవి, వారుణి, ధనుస్సు, చంద్రుడు, శంఖము, 'ధన్వంతరి' బయటికి వచ్చిరి. చివరకు అందుండి 'అమృతము' ఉద్భవించెను. దానికొఱకై దేవతలు, దానవులు పోట్లాడుకొనసాగిరి. అప్పుడు శ్రీమన్నారాయణుడు మోహినీ రూపమునుదాల్చి అమృతమును దేవతలకు పంచెను. వారు దానినిసేవించి అమరులైరి. యుద్ధమున విజయులైరి.

అట్లు భగవంతునిసహాయముతో విజయమును పొందిన దేవతలు ఆయనను పలువిధములుగా స్తుతించిరి. వారిస్తోత్రములకు భగవంతుడు ప్రసన్నుడై ఇట్లు పల్కెను. "ఓ దేవతలారా! భగవంతుని ఆశ్రయించి, తమకర్మలను ఆచరించువారే నిజమైన దేవతలు. వారికే సుఖశాంతులు లభించును. వారే అమృతమును, లేదా అమృతతత్త్వమును పొందగలరు. కాని అభిమానముతో కర్మచేయువారికి ఎన్నటికిని అమృతము లభింపదు." ఇట్లు వచించినపిమ్మట కూర్మావతారుడైన భగవంతుడు అంతర్ధానమయ్యెను. సంతతము భక్తులనుకాపాడునట్టి కచ్ఛపభగవానునకు (కూర్మావతారునకు) వేలకొలది నమస్కారములు.



Scanned with CamScanner



Scanned with CamScanner

# 3. వరాహావతారము

ప్రళయకాలమున భూమండలము జలములలో మునిగిపోవుచుండెను. అప్పుడు దానిని ఉద్ధరించుటకై భగవానుడు వరాహావతారమును ఎత్తెను. ఒకనాడు 'స్వాయంభువ మనువు' మిక్కిలివినయముతో చేతులు జోడించి, తనతండ్రియైన బ్రహ్మదేవునితో ఇట్లు పలికెను. "తండ్రీ! మీరు సమస్తప్రాణులకును సృష్టికర్తలు. అందఱిని పోషించెడివారు మీరే. మేము అందఱము మీకు నమస్కరించుచున్నాము. మీకు ఎట్లు సేవలు చేయవలెనో తెలుపుడు. మిమ్ములనుసేవించుటకు అనుజ్ఞను దయచేయుడు. మనువు పలికిన ఈ మాటలను విని, బ్రహ్మదేవుడు ఇట్లు వచించెను. "కుమారా! నీకు శుభమగుగాక నీయెడ ప్రసన్నుడను ఐతిని. నా ఆజ్ఞను కోరుచు నీవు నన్ను శరణుజొచ్చితివి. తల్లిదండ్రులను ఇట్లే పూజింపవలెను. వారిఆజ్ఞలను భక్తిశ్రద్ధలతో పాటింపవలెను. నీవు ధర్మమును అనుసరించి ఈ భూమిని పాలింపుము. యజ్ఞములద్వారా శ్రీహరిని ఆరాధింపుము. ప్రజలను చక్కగాపాలించుటయే నీవు నాకు చేసెడి సేవ." పిమ్మట మనువు ఇట్లనెను. "ఓ తండ్రీ! మీఆజ్ఞను నేను తప్పక పాలింతును. కాని సకలప్రాణులకును నివాసస్థానమైన భూమండలము ప్రళయకాలజలములలో మునిగి ఉన్నది. ఇట్టి స్థితిలో నేను ఈ భూమినిఎట్లు పాలింపగలను?"

భూమండలము యొక్క ఈస్థితిని జూచి, బ్రహ్మదేవుడు మిగుల చింతించెను. 'ఈభూమిని ఉద్ధరించుట ఎట్లు?' అని ఆలోచింపసాగెను. ఇంతలో ఆయన ముక్కుచివరనుండి హఠాత్తుగా బొటనవ్రేలి ప్రమాణములో ఒక వరాహశిశువు వెడలెను. చూచుచుండగనే ఆ శిశువు పర్వతాకారుడై గర్జింపసాగెను. 'ఇదియంతయు భగవంతునిలీల' అని సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు గుర్తించెను. భగవంతునిగర్జనలను విని, బ్రహ్మదేవుడు ఆస్వామిని స్తుతించెను. ఆయన స్తోత్రములకు వరాహభగవానుడు ప్రసన్నుడు అయ్యెను. లోకకల్యాణముకొఱకై ఆ స్వామి జలములలో ప్రవేశించెను. కొంతసేపటికి జలములలో మునిగియున్న భూమిని తనకోఱలపై నిలుపుకొని పాతాళలోకమునుండి పైకివచ్చుచుండెను. మార్గమధ్యమున ఆ ప్రభువునకు విఘ్నము కలిగించుటకై పరాక్రమశాలియైన హిరణ్యాక్షుడు అడ్డుతగిలెను. అతడు జలములలోనే తనగదతో ఆ స్వామిని ఎదిరించెను. ఆ కారణమున ఆ దేవదేవునికోపము చక్రమువలె తీక్ష్ణమాయెను. సింహము ఏనుగునువలె ఆజగన్నాథుడు ఆరక్కసుని అవలీలగా సంహరించెను. భూమండలమును ఉద్ధరించెను.

జలములనుండి బయటికి వచ్చిన వరాహభగవానుని జూచి, బ్రహ్మాదిదేవతలు అంజలిఘటించి అనేక విధముల కొనియాడిరి. అంతట ఆ స్వామి ప్రసన్నుడై తనగిట్టలచే జలములను నిరోధించి, దానిపై భూమండలమును స్థిరముగా ఉంచెను.

భూమండలమును ఉద్ధరించి లోకములను కాపాడిన వరాహభగవానునకు మేము నమస్కరించుచున్నాము. ఓ స్వామీ! నీకు జయము జయము.



Scanned with CamScanner



Scanned with CamScanner

# 4. నరసింహావతారము

హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు ఇద్దఱును సోదరులు. తన సోదరుడైనహిరణ్యాక్షుడు వధింపబడుట వలన హిరణ్యకశిపుడు మిగుల దుఃఖితుడయ్యెను. ఆ కారణముగా ఆరాక్షసుడు శ్రీహరిపై వైరమును పూనెను. తాను అజేయుడు అగుటకై తీవ్రమైనతపస్సు చేసెను. దేవతలవలన గాని, మనుష్యులచే గాని, పశువులవలనగాని తనకు చావులేకుండునట్లు అతడు బ్రహ్మదేవునినుండి వరములను పొందెను. ఇంక తనను ఎవ్వరును జయింపజాలరని అతడు గర్వముతో విఱ్ఱవీగుచుండెను.

హిరణ్యకశిపునిపాలన మిక్కిలిఘోరముగా ఉండెను. ఆ కారణముగా దేవతలు, దానవులు మిగుల భీతిల్లుచు ఆయనపాదములకు నమస్కరించుచుండిరి. శ్రీహరిని పూజించువారిని అతడు కఠినముగా దండించుచుండెను. అతనిదుష్టశాసనములను భరింపజాలక ముల్లోకములవారును, లోకపాలురును గడగడలాడుచుండిరి. వారిని ఆదుకొనువారు లేకపోవుటచే వారికి దిక్కుతోచకుండెను. అప్పుడు వారు భగవంతుని శరణుజొచ్చిరి. దేవతలస్తుతులకు శ్రీమన్నారాయణుడు ప్రసన్నుడై, 'హిరణ్యకశిపుని వధించెదను' అని పల్కి వారికి అభయమిచ్చెను.

ఆరాక్షసరాజు ఆగడములు రోజురోజునకును మితిమీఱిపోవుచుండెను. శ్రీహరినామమును స్మరించుచున్నాడను కారణమున అతడు తనకుమారుడైన ప్రహ్లాదునిగూడ అనేకవిధముల బాధించెను. ప్రహ్లాదుడు ఆ శ్రీహరికి పరమభక్తుడు. అతడు బాల్యమునుండియే ఆటపాటలను ప్రక్కనబెట్టి దైవధ్యానము నందే మునిగియుండెడివాడు. అప్పుడప్పుడు అతడు రాక్షసబాలురకు దైవభక్తినిగూర్చి బోధించుచుండెడివాడు.

ప్రహ్లాదునిదైవభక్తినిగూర్చి విని హిరణ్యకశిపుడు మిగుల క్రుద్ధుడాయెను. అతడు బాలుడైన తన కుమారుని సభకు పిలిపించెను. అప్పుడు ప్రహ్లాదుడు ఎంతోవినయముతో చేతులుజోడించి, తనతండ్రి ఎదుట మౌనముగా నిలబడెను. ఆ రాక్షసరాజు అతనిని జూచి మందలించుచు ఇట్లు పలికెను. "మూర్ఖుడా! నీవు మిక్కిలి హద్దుమీఱి ప్రవర్తించుచున్నావు. నీవు ఎవరిబలము చూచుకొని నాఆజ్ఞలకు వ్యతిరేకముగా నడచుకొనుచున్నావు?"

అందులకు ప్రహ్లాదుడు ఇట్లు సమాధానమును ఇచ్చెను. "తండ్రీ! బ్రహ్మదేవుడు మొదలుకొని చిట్టిచీమ వఱకు గల చిన్న పెద్ద చరాచరప్రాణులన్నియును భగవంతుని అధీనములోనే ఉన్నవి. ఆ పరమేశ్వరుడే తన శక్తులద్వారా ఈ విశ్వమును సృష్టించి, రక్షించి, లయమొనర్చుచున్నాడు. మీరు మీ అసురభావమును విడిచిపెట్టుడు. అందఱియెడ ఉదారులై మెలగుడు."

ప్రహ్లాదునివచనములను విని హిరణ్యకశిపుడు భగ్గున మండిపడెను. అతడు ప్రహ్లాదునితో "ఓరీ! మందబుద్ధీ! నీవు వదరుటను చాలింపుము- నీ భగవంతుడు అంతటను ఉన్నచో ఈ స్తంభములో అతనిని చూపగలవా? అని పల్కెను. ఇట్లు పలికి కోపముతో ఊగిపోవుచు గదను దీసికొని, తనసింహాసనము నుండి క్రిందికి దూకెను. వెంటనే ఆ గదతో వేగముగా స్తంభమును కొట్టెను. అప్పుడు ఆ స్తంభమునుండి నరసింహస్వామి ఆవిర్భవించెను. ఆయనయొక్క శరీరములో సగభాగము సింహరూపము, మిగిలిన సగభాగము మానవరూపముగ ఉండెను. అంతట నరసింహస్వామి ఒక్క క్షణములో అనాయాసముగా ఆ హిరణ్యకశిపుని జీవితమును సమాప్తి చేసెను. తన పరమభక్తుడైనప్రహ్లాదుని రక్షించెను. లోకములను కాపాడెను.

సర్వవ్యాపియైన నరసింహస్వామికి మేము ప్రణమిల్లుచున్నాము.

**ఇందుగలడందులేడని, సందేహమువలదు, చక్రిసర్వోపగతుం**
**డెందెందువెదకి చూచిన, అందందేగలడు దానవాగ్రణి వింటే!**



Scanned with CamScanner



Scanned with CamScanner

# 5. వామనావతారము

ఒక పర్యాయము దైత్యరాజైనబలిచక్రవర్తి యుద్ధమున ఇంద్రునిచేతిలో ఓడిపోయి, తనగురువైన శుక్రాచార్యుని శరణుజొచ్చెను. అప్పుడు శుక్రాచార్యుడు అతనిలో దివ్యభావమును మేలుకొల్పెను. అనంతరము కొంతకాలమునకు గురుకృపవలన బలిచక్రవర్తి స్వర్గముపై దండెత్తి, దానిపై తన అధికారమును స్థాపించెను. నిన్నటివఱకును దేవతలకు ప్రభువుగా ఉన్న ఇంద్రుడు నేడు ఒకదిక్కులేనివాడాయెను. ఇది అంతయును దైవలీల. అంతట ఇంద్రుడు ఏమి చేయుటకును తోచనివాడై పలుప్రదేశములలో తిరిగితిరిగి, చివరకు తనతల్లియైన అదితిని శరణుజొచ్చెను. ఇంద్రునిదుర్దశను జూచి, ఆ తల్లిహృదయము తల్లడిల్లెను. తనయునిదుఃఖమును జూచి, ఆమె మిగులపరితపించినదై 'పయోవ్రతమును' ఆచరించెను. వ్రతము ముగియుచున్న సమయమున శ్రీహరి ఆమెకు ప్రత్యక్షమై ఇట్లు పచించెను. "అమ్మా నీవు చింతింపకుము. నేను నీకు పుత్రుడనై జన్మించెదను. ఇంద్రునకు తమ్ముడనై ఆయనకు మేలుచేసెదను." ఇట్లు పలికి శ్రీమహావిష్ణువు అంతర్ధానమయ్యెను.

చివరకు ఆ శుభసమయము రానేవచ్చెను. అదితిగర్భమున భగవంతుడు వామనరూపమున అవతరించెను. భగవంతుని పుత్రునిగాపొందిన అదితి అంతులేని సంతోషమును పొందెను. వామనుడై అవతరించిన ఆ శ్రీహరినిజూచి, బ్రహ్మాదిదేవతలు, మహర్షులు మిగుల ఆనందించిరి. కశ్యపునిద్వారా ఆ వామనమూర్తికి వారు ఉపనయనాది సంస్కారములను జరిపించిరి.

ఇదే సమయమున బలిచక్రవర్తి 'భృగుకచ్ఛము' అను ప్రదేశమున అశ్వమేధయాగమును చేయుచుండెను. ఆ విషయము వామనునకు తెలియును. వెంటనే ఆస్వామి అచటికి బయలుదేఱెను. ఆ వామనుడు నడుమున ముంజిని, భుజముపై యజ్ఞోపవీతమును ధరించియుండెను. చంకలో మృగచర్మమును, శిరమున జడలను కలిగియుండెను. ముఖమున దివ్యతేజస్సు ఉట్టిపడుచుండెను. బ్రాహ్మణబ్రహ్మచారివేషమున వామనుడు బలిచక్రవర్తియొక్క యాగశాలలో ప్రవేశించెను. ఆ మహాత్మునిదివ్యతేజస్సును జూచి బలిచక్రవర్తి పులకితుడాయెను. ఆయనను ఉత్తమమైనఆసనమున కూర్చుండబెట్టి ఆ స్వామికి అతిథి పూజాసత్కారములను చేసెను.

అనంతరము బలిచక్రవర్తి 'ఏదైనను కోరుకొనుము' అని ఆ స్వామిని ప్రార్థించెను. అప్పుడు వామనుడు మూడడుగుల భూమిని మాత్రము కోరెను. శ్రీహరిలీలలను గ్రహించిన శుక్రాచార్యుడు ఆ వామనునకు దానము ఇయ్యవలదని బలితో నుడివెను. ఆడినమాట తప్పనివాడైన ఆ బలి అందులకు సమ్మతింపలేదు. దానమును ధారపోయుటకై బలిచక్రవర్తి జలపాత్రను చేతబట్టెను. తనశిష్యునిహితమునకై ఆరాటపడుచున్న శుక్రాచార్యుడు ఆ జలపాత్రలో ప్రవేశించి, నీటిధారకు అడ్డుపడెను. అప్పుడు ఆ శ్రీహరి ఒక దర్భతో జలధారరంధ్రమున పొడిచెను. దానితో శుక్రాచార్యుని ఒకకన్ను దెబ్బతినెను. ఆయనఅడ్డుతొలగెను.


సంకల్పము పూర్తియైనపిమ్మట బలిచక్రవర్తి దానజలమును ధారపోయగా, వామనుడు ఒకపాదముతో భూమిని, మఱొకపాదముతో స్వర్గమును (ఆకాశమును) ఆక్రమించెను. మూడవపాదమునకు చోటు చూపుమనగా అతడు ఆస్వామికి తనశిరమును అప్పగించెను. బలియొక్క ఈ ఆత్మ సమర్పణభావముతో భగవానుడు ప్రసన్నుడాయెను. అతనికి పాతాళలోకరాజ్యమును అప్పగించి, ఇంద్రుని స్వర్గమునకు ప్రభువును చేసెను. ఆ శ్రీహరిఅవతారమైన వామనుడు ద్వారపాలకునిరూపములో బలిచక్రవర్తికిని, ఉపేంద్రుని రూపములో దేవేంద్రునకును నిత్యము దర్శనమును ఇచ్చుచుండునని ప్రతీతి.

పరమదయాళువైన వామనమూర్తికి మేము ప్రణమిల్లుచున్నాము.

**ఆ॥వె॥ ఒంటివాడ, నాకు ఒకటి రెండడుగుల, మేర ఇమ్ము, సొమ్ము మేరయొల్ల ।**
**కోర్కిదీర బ్రహ్మకూకటిముట్టెద, దానకుతకసాంద్ర! దానవేంద్ర! ॥**



Scanned with CamScanner




Scanned with CamScanner



Scanned with CamScanner

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥



Scanned with CamScanner

# 6. పరశురామావతారము

ఇది యుగయుగాలనాటి మాట. హైహయవంశప్రభువుల అధర్మము మితిమీఱిపోవుచుండెను. అన్నివైపుల నుండియు ప్రజలహాహాకారములే వినబడుచుండెను. గోవులకును, బ్రాహ్మణులకును, సత్పురుషులకును రక్షణ కఱవయ్యెను. దేశమునందు అంతటను అల్లకల్లోలములు చెలరేగుచుండెను. అట్టిసమయమున దుష్టులనుసంహరించి, ధర్మమునునిలుపుటకై శ్రీహరి పరశురాముడై అవతరించెను.రేణుకాజమదగ్నులు ఆయనతల్లిదండ్రులు.

ఆ కాలములో హైహయవంశమునకుచెందిన కార్తవీర్యార్జునుడు (సహస్రబాహు అర్జునుడు) రాజుగా ఉండెను. అతడు మిగులబలశాలి. కాని అతడు క్రూరస్వభావము గలవాడు, అకృత్యములకు పాల్పడువాడు. ఒకసారి అతడు తనపరివారములతో జమదగ్నిమహర్షిఆశ్రమమునకు వచ్చెను. అతడు ఆఋషి ఆశ్రమమునందలి వృక్షములను ధ్వంసము చేయుటయేగాక అచట నున్న గోమాతనుగూడ అపహరించుకొని పోయెను. కార్తవీర్యార్జునుడుచేసిన ఈ దుష్టకార్యములు పరశురామునకు తెలిసెను. వెంటనే ఆమహాత్ముడు ఆ దుష్టుని సంహరించెను.

**కం॥ కరములు దునిసిన అతనికి, శిరమొక్కటి చిక్క శైలశిఖరము భంగిన్ ।**
**పరశువున అదియుద్రుంచెను, పరసూదనుడైన ఘనుడు భార్గవుడు వడిన్ ॥**

సహస్రబాహువు మరణింపగనే అతని పదివేలమందికుమారులు భయపడి పాఱిపోయిరి. వారి మనస్సులలో తమతండ్రివధనుగూర్చిన విషయము నిరంతరము మెదలుచునే యుండెను. ఆ విధముగా కలతచెందియున్న వారికి ఒక్కక్షణముగూడ మనశ్శాంతి లేకుండెను.


ఒకనాడు పరశురాముడు తనసోదరులతోగూడి ఆశ్రమమునకు దూరముగా వెళ్లియుండెను. ఇదే అనుకూల సమయము అని తలంచి, కార్తవీర్యార్జునునికుమారులు ఆశ్రమములో ప్రవేశించిరి. ఒంటరిగా ఉన్న జమదగ్నిమహర్షిని ఆ పాపాత్ములు చంపివేసిరి. అప్పుడు ఆమహర్షిపత్నియైన రేణుకాదేవి తనపతి మరణమునకు మిగుల విలపింపసాగెను.

పరశురామునకు దూరమునుండియే తనతల్లిఆక్రందన వినిపించెను. మఱుక్షణమే అతడు ఆశ్రమమునకు వచ్చి చూడగా మృతుడైపడియున్న తన తండ్రి కనబడెను. పరశురామునిలో క్రోధము శోకము పెల్లుబికెను. తనతండ్రికళేబరమును సోదరులకు అప్పగించి, చేత గండ్రగొడ్డలినిపూని, క్షత్రియులను సంహరించుటకై స్వయముగా బయలుదేఱెను. ఆనాటి క్షత్రియులలో ఎక్కువమంది పరమదుర్మార్గులుగా ఉండిరి. తనతండ్రివధను నిమిత్తముగాచేసికొని ఇరువదియొక్కసారులు క్షత్రియులపై దండెత్తి, అతడు వారిని మట్టుపెట్టెను. భగవానుడు భృగువంశమున అవతరించి, భూమండలమునకు భారముగానున్న రాజులను అందఱిని సంహరించి, ధర్మమును కాపాడెను. పిమ్మట పరశురాముడు తనతండ్రిని మఱల బ్రతికించెను. అనంతరము జమదగ్ని సప్తమహర్షులలో ఒకడుగా ప్రసిద్ధికెక్కెను. పిదప పరశురాముడు యజ్ఞమొనర్చి, తానుజయించిన భూమండలమును పూర్తిగా కశ్యపమహర్షికి దానముచేసి, తపస్సుచేసికొనుటకై అతడు మహేంద్రగిరికి వెళ్లెను.

మహేంద్రపర్వతముపై విరాజమానుడైయున్న పరశురామభగవానునకు మేము ప్రణమిల్లుచున్నాము.



Scanned with CamScanner



Scanned with CamScanner

# 7. శ్రీరామావతారము

ఇది పురాణప్రసిద్ధమైన ఒకగాథ. శ్రీమన్నారాయణునికడ వైకుంఠద్వారమున 'జయవిజయులు' అనువారు ద్వారపాలకులుగా ఉండిరి. సనకాదిబ్రహ్మర్షులయొక్క శాపమువలన వారు రాక్షసవంశమున రావణ కుంభకర్ణులుగా జన్మించిరి. వారి అరాచకములకు భూదేవి మిగులవణకిపోయెను. పాపములభారమును ఆమె మోయలేకపోయెను. అప్పుడామె బ్రహ్మాదిదేవతలతోగూడి శ్రీహరిని శరణువేడెను. దేవతలమొఱను ఆలకించి పరమాత్ముడు ప్రసన్నుడై వారికి అభయమిచ్చి పంపివేసెను. పిమ్మట ఆ నారాయణుడు కోసలదేశము నందలి అయోధ్యానగరమున కౌసల్యాదశరథులు అను పుణ్యదంపతులకు 'శ్రీరాముడు' అను పేరుతో పుత్రుడై జన్మించెను.

శ్రీరాముడు వసిష్ఠమహర్షివద్ద వేదవేదాంగములు మొదలగు వివిధవిద్యలను అభ్యసించెను. పిమ్మట విశ్వామిత్రుని వెంటజని, ఆయనయజ్ఞమునకు విఘ్నములు కలిగించుచున్న మారీచుని పాఱద్రోలెను. సుబాహువు మొదలగు రాక్షసులను అందఱిని హతమార్చెను. ఆమహర్షి యజ్ఞమును రక్షించెను. అహల్యాదేవికి శాపవిముక్తి కలిగించిన పిమ్మట ఆ రఘురాముడు తమ్ముడైన లక్ష్మణునితోడను, విశ్వామిత్రమహాముని తోడనుగూడి, జనక మహారాజు రాజధానియైన మిథిలానగరమునకు చేరెను. అప్పుడు అచట సీతాదేవి స్వయంవరము జరుగుచుండెను. రాజసభాభవనమున పరమశివునిధనుస్సు ఉంచబడెను. అది విశాలమైనది, బలిష్ఠమైనది. శ్రీరాముడు దానిని అవలీలగాఎక్కుపెట్టి (శివధనుర్భంగము గావించి) సీతాదేవిని పెండ్లియాడెను.

కైకవరములకారణముగా తండ్రియగు దశరథమహారాజును సత్యసంధుని గావించుటకై, శ్రీరాముడు పదునాలుగు సంవత్సరములపాటు వనవాసమునకై అయోధ్యను వీడి బయలుదేఱెను. సీతాదేవియు, లక్ష్మణుడును ఆయన వెంట వనములకు నడచిరి.

వనములలోనుండగా రావణునిచెల్లెలైన శూర్పణఖ రామలక్ష్మణులకడకు వచ్చెను. ఆ రాక్షసి కామపరవశయై తనను పెండ్లియాడుడని వారిని కోరెను. లక్ష్మణుడు ఆమె ముక్కుచెవులుకోసి కురూపినిగా చేసెను. ఆమెసోదరులైన ఖరదూషణాదులు దండెత్తిరాగా శ్రీరాముడు వారిని అందఱిని సంహరించెను. శూర్పణఖ సోదరుడైన రావణుడు ఆమెదురవస్థను జూచి మిగులక్రుద్ధుడాయెను. శ్రీరామునిపై వైరముపూని, పంచవటిలోనున్న సీతాదేవిని మోసముతో అపహరించెను. భార్యఎడబాటునకు శ్రీరాముడు మిక్కిలి పరితపించెను. ప్రాణసమానురాలైన సీతను వెదకుచు రఘురాముడు లక్ష్మణునితోగూడి వనములను అన్నింటిని గాలించెను. సీతను రక్షించుటకై రావణుని ఎదిరించి గాయపడి, ప్రాణములను కోల్పోయిన జటాయువునకు శ్రీరాముడు దహనసంస్కారములను చేసెను. కబంధునకు శాపవిముక్తిని కలిగించెను. శబరికి ముక్తిని ప్రసాదించెను. ఋశ్యమూకపర్వతముపైనున్న సుగ్రీవుడు మొదలగు వానరులతోమైత్రి ఏర్పఱచుకొనెను. వారికోరికపై వాలిని హతమార్చి, కిష్కింధకు సుగ్రీవుని రాజునుగాచేసెను.


అనంతరము హనుమంతుడు సీతాదేవిని వెదకుచు లంకకు చేరెను. అచట అశోకవనములో సీతాదేవిని కలిసి, శ్రీరామునిఉంగరమును ఆమెకు ఆనవాలుగా ఇచ్చెను. అతడు రాక్షసులనువధించి, లంకను కాల్చెను. మఱలివచ్చునప్పుడు సీతాదేవిఇచ్చిన చూడామణిని గ్రహించి, దానిని శ్రీరామునకు సమర్పించి, సీతమ్మ క్షేమవార్తను తెలిపెను. పిమ్మట శ్రీరాముడు వానరసేనతోగూడి సముద్రతీరమునకు చేరెను.

రావణునితమ్ముడైన విభీషణుడు శ్రీరామునిశరణుజొచ్చెను. రఘురాముడు వానరుల సాయముతో సముద్రముపై వారధిని నిర్మింపజేసెను. సుగ్రీవుడు, హనుమంతుడు, అంగదుడు, జాంబవంతుడు మొదలగు ప్రముఖవీరులతో, వానరసైన్యము వెంటరాగా రఘువీరుడు లంకకు చేరెను. రామరావణులమధ్య ఘోరయుద్ధము జరిగెను. శ్రీరాముడు రావణునివధించి, లంకకు విభీషణుని రాజునుగావించెను. పిమ్మట శ్రీరాముడు సీతాలక్ష్మణులు మున్నగువారితో గూడి అయోధ్యకు మఱలివచ్చెను. రామరాజ్యమునుస్థాపించి ప్రజలలోప్రేమను, వినయమును, సదాచారములను, తల్లిదండ్రుల, గురువులయెడ భక్తిభావము మొదలగువానిని నెలకొల్పెను. భగవానుడు మానవుడుగా అవతరించి తన ఆదర్శజీవితముద్వారా లోకమున ధర్మమును కాపాడెను. మర్యాదాపురుషోత్తముడైన శ్రీరామచంద్ర ప్రభువునకు శతసహస్రవందనములు.

**చరితం రఘునాథస్య శతకోటిప్రవిస్తరమ్ । ఏకైక మక్షరం ప్రోక్తమ్ మహాపాతక నాశనమ్ ॥**



Scanned with CamScanner




Scanned with CamScanner

# 8. శ్రీకృష్ణావతారము

శూరసేనమహారాజుయొక్క కుమారుడు వసుదేవుడు. అతడు దేవకి యను రాజకుమారిని పెండ్లియాడెను. అతడు తనభార్యతోగూడి స్వగృహమునకు రథముపై బయలుదేఱెను. ఉగ్రసేనుని కుమారుడైనకంసుడు దేవకీదేవికి అన్న. అతనికి చెల్లెలనిన ప్రాణము. క్రొత్తగా వివాహమై మథురనుండి ఇంటికివెళ్లుచున్న దేవకీవసుదేవులరథమును కంసుడు నడుపుచుండెను. ఆసమయమున ఆకాశవాణి అతనిని సంబోధించుచు, "ఓరీ! కంసుడా! నీవు మూర్ఖుడవు. నీవు రథములో తీసికొనివెళ్లుచున్న ఈ దేవకీవసుదేవుల ఎనిమిదవసంతానము నిన్ను సంహరించును." అని చెప్పెను. దుష్టుడైనకంసుడు ఆకాశవాణి పలుకులను వినగానే క్రుద్ధుడై దేవకీదేవిని అచటనే చంపుటకు తనఖడ్గమును ఎత్తెను. అప్పుడు వసుదేవుడు దేవకికికలిగినపుత్రులను అందఱిని కంసునకు అప్పగించెదనని పలికెను. అంతట కంసుడు శాంతించెను.

పిమ్మట కంసుడు దేవకీవసుదేవులను కారాగారమున ఉంచెను. వారికి కలిగినపుత్రులను పుట్టినవెంటనే చంపసాగెను. కాని భగవంతునిలీలలు అద్భుతములు గదా! వాటిని ఎవ్వరాపగలరు? శ్రీకృష్ణుడు జన్మించు సమయము రానేవచ్చెను. శ్రావణ బహుళఅష్టమినాడు శ్రీమన్నారాయణుడు దేవకీవసుదేవులపుత్రుడుగా కృష్ణుడై అవతరించెను.

భగవంతుడు అవతరింపగనే యోగమాయాప్రేరణతో చెరసాల తలుపులు వాటియంతటఅవే తెఱచుకొనెను. వసుదేవుడు శిశువుగాఉన్న ఆ కృష్ణస్వామిని ఒకచేటలో ఉంచుకొని వ్రేపల్లెకు బయలుదేఱెను. త్రోవలో యమునానది కృష్ణప్రభుపాదములను తాకుటకు తహతహపడుచుండెను. అంతర్యామియైన ఆ ప్రభువు యమునకోరికను నెఱవేర్చెను. వసుదేవుడు యమునానదిని దాటి వ్రేపల్లెకు చేరెను, అచట నందుని ఇంటిలో యశోదామాతప్రక్కలో ఆచిన్నారిని పరుండబెట్టెను. అప్పుడేపుట్టి ఆమెప్రక్కలో ఉన్న ఆడశిశువును తీసికొని వసుదేవుడు మథురకు వచ్చెను.

శ్రీకృష్ణుని కుమారునిగా పొందిన యశోదానందులఆనందములకు అవధులులేకుండెను. 'యశోదమ్మకు కొడుకు కలిగినాడు' అను వార్తను వినగానే వ్రేపల్లెవాసులు అందఱును సంతోషముతో పొంగిపోయిరి. తన బాలలీలలచే శ్రీకృష్ణుడు యశోదమ్మను నిత్యము మురిపింపజేయుచుండెను. ఆయనయొక్క పిల్లనగ్రోవి స్వరమును వినగానే గోకులమునందలి గోవులు, గోపాలురు తన్మయులగుచుండిరి. గోపికలఇండ్లలో వెన్నలను దొంగిలించుటవలన కృష్ణునకు 'వెన్నదొంగ' అను పేరు కలిగెను. శ్రీకృష్ణునిచంపుటకై కంసుడు పూతన, బకాసురుడు, తృణావర్తుడు మొదలగు రాక్షసులను పంపెను. బాలుడైనశ్రీకృష్ణుడు ఆడుచుపాడుచు వారినందఱినీ సంహరించెను. ఒకవ్రేలిపై గోవర్ధనపర్వతమును ఎత్తి ఇంద్రునిగర్వమును అణచెను.

ఒకనాడు శ్రీకృష్ణభగవానుడు బంతియాట ఆడుచుండెను. బంతి యమునాజలములలో పడిపోయెను. ఆ బంతికొఱకై శ్రీకృష్ణుడు యమునలో దూకెను. అందు 'కాళీయుడు' అను ఒక మహాసర్పము ఉండెను. భగవానుడు ఆ కాళీయుని మదమణచి, అతని పడగలపై నృత్యము చేసెను. ఈ విధముగా చిన్నతమునందే ఆ చిన్నికృష్ణుడు పెక్కు అద్భుతలీలలను ప్రదర్శించెను.

కొంతకాలము గడచినపిమ్మట శ్రీకృష్ణుడు అక్రూరునితోగూడి గోకులమునుండి మథురకు వచ్చెను. అచట తనభక్తులైన సుదాముడు అను దర్జీవానిని, మాలాకారుని, 'కుబ్జ' అనునామెను అనుగ్రహించెను. అటుపిమ్మట శ్రీకృష్ణుడు కంసుడు మొదలగు అసురులను సంహరించి తన తల్లిదండ్రులకు బంధవిముక్తిని కలిగించెను. యుద్ధ రంగమున అర్జునునకు ధర్మమునుగూర్చియు కర్మ, భక్తి, జ్ఞాన మార్గములను గుఱించియు ఉపదేశించెను. ఆ ఉపదేశములే 'భగవద్గీత'గా ప్రసిద్ధికెక్కెను. అవి నేటికిని దేశవిదేశములలో జనులకు మేలు చేయుచున్నవి.

లీలాపురుషోత్తముడైన శ్రీకృష్ణభగవానునకు వేలకొలది జేజేలు.

**శ్లో॥ అవతారాః సన్త్యన్యే సరసిజనయనస్య సర్వతో భద్రాః ।**
**కృష్ణాదన్యః కోవా ప్రభవతి గోగోపగోపికాముక్త్యై ॥**



Scanned with CamScanner



Scanned with CamScanner

# 9. బుద్ధావతారము

నేటికి దాదాపు రెండువేలఐదువందల సంవత్సరములక్రిందట హింస పెచ్చుపెఱిగియుండెను. ధర్మము పేరుతో పశువులను చంపుచుండిరి. అప్పుడు జీవహింసను ఆపుటకై, శాంతిని ఏర్పఱచుటకై భగవంతుడు మాయాదేవి గర్భమునందు 'బుద్ధుడై' అవతరించెను. ఆయన తండ్రిపేరు శుద్ధోదనుడు. ఆ ప్రభువుయొక్క రాజధాని' కపిలవస్తునగరము. బుద్ధుని చిన్ననాటిపేరు సిద్ధార్థుడు. అతడు జన్మించిన కొద్దిరోజులలోనే తల్లి మృతిచెందుటచే గౌతమి యను దాది అతనిని పెంచి పెద్దచేసెను. అందువలన ఆయనకు 'గౌతముడు' అనియు పేరు ఏర్పడెను.

రాజకుమారుడైన ఈ సిద్ధార్థునిజాతకమును జూచిన జ్యోతిషపండితులు 'అతడు చక్రవర్తియగును, లేదా విరక్తుడై లోకకల్యాణమును గావించునట్టి మహాపురుషుడు అగును-" అని పలికిరి. ఈ మాటలను విని, శుద్ధోదనమహారాజు మిగుల చింతాక్రాంతుడయ్యెను. అతడు రాజకుమారునికై (తన పుత్రునకై) ఒక ప్రత్యేక భవనమును నిర్మింపజేసెను. అందు సకలసుఖములకు ఏర్పాటు చేసెను. దుఃఖము, రోగము, ముసలితనము, మృత్యువు అను మాటలుగూడ అందు ప్రవేశింపకుండ చేసెను. సిద్ధార్థునివివాహమును 'యశోధర' అను రాజకుమార్తెతో జరిపించెను. వారికి రాహులుడు అను తనయుడు కలిగెను.

రాజకుమారుడైన సిద్ధార్థుడు మిక్కిలిదయాళువు. ఒకసారి అతడు తండ్రిఆజ్ఞతో నగరమును చూచుటకు రథముపై బయలుదేఱెను. దుఃఖమునుకలిగించు ఎట్టి దృశ్యముగూడ ఆయనకు కనపడగూడదని మహారాజు రథసారథిని ఆదేశించెను. కాని విధినిర్ణయమును ఎవరు మార్చగలరు? నగరమును దర్శించుసమయమున సిద్ధార్థునకు ఒకవృద్ధుడు, ఒకరోగి కనబడిరి. ప్రతిప్రాణికిని ముసలితనము, రోగములు తప్పవని అతడు సారథివలన తెలిసికొనెను. ఇంకను ముందునకు సాగిపోవు చుండగా కొందఱు ఒకశవమును మోసికొనిపోవుటను అతడు చూచెను. 'అదేమి?' అని అడుగగా సారథి 'అది శవము' పుట్టిన ప్రతిప్రాణియు మరణించుట సహజము' అని అతనితో పలికెను. మఱికొంత దూరము పోగా అతనికి ఒక సన్న్యాసి కనపడెను. 'ఇతడు ఎవరు?' అని సిద్ధార్థుడు అడిగెను. అప్పుడు సారథి 'అతడు ఒకసన్న్యాసి. సంసారబంధములనుండి బయటపడిన విరాగి' అని సమాధానమునిచ్చెను. ఈ దృశ్యములను చూచినపిమ్మట సిద్ధార్థునకు సంసారసుఖములమీద విరక్తి ఏర్పడెను.

ప్రాణికి ముసలితనము సహజమా? రోగములు తప్పవా? మరణము తథ్యమా? వైరాగ్యమే శరణ్యమా? అను ఆలోచనలు నిరంతరము ఆయనమనస్సును కలవరపెట్టసాగెను. ఈ ప్రశ్నలకు సమాధానములను తెలిసికొనుటకై ఆయన నిశ్చయించుకొనెను. ఒకనాడు అర్ధరాత్రివేళ ఎవ్వరికిని తెలియకుండా అతడు రాజభవనమునుండి బయటపడెను. అరణ్యములలో తీవ్రమైనతపస్సుచేసెను. చివరకు బోధివృక్షముక్రింద ఆయనకు జ్ఞానోదయమయ్యెను. అప్పటినుండియు అతడు బుద్ధభగవానుడుగా ప్రసిద్ధికెక్కెను.


బుద్ధభగవానుడు తాను తెలిసికొనిన సత్యములను ఇట్లు ప్రచారమొనర్చెను. సంసారము దుఃఖమయము. లౌకికపదార్థములను పొందవలెను అనెడితృష్ణ (కోరిక)యే దుఃఖములకు మూలకారణము - ఈ తృష్ణను అన్నివిధములుగా త్యజించుటచే దుఃఖములు నశించును - రాగద్వేషములు, అహంకారము విడిచి పెట్టుటవలన జీవులకు ముక్తి లభించును. సత్యము, వినయము, సదాచారము, సద్విచారము, సద్గుణములు, సద్బుద్ధి, ఉన్నతలక్ష్యము, ధ్యానము అను ఈ ఎనిమిదింటిని సాధనచేయుటచే మానవుడు అన్ని దుఃఖముల నుండియు విముక్తుడగును, పరమశాంతిని పొందును.

మానవులు ఆచరింపవలసిన ఈ పరమధర్మములను దేశమంతయుతిరిగి అతడు ప్రచారము చేసెను. యజ్ఞములలో పశువధను మాన్పించెను. జీవులయెడ ప్రేమ, అహింస, సద్భావన అను ఉదాత్తలక్ష్యములను బోధించెను. నేటికిని బుద్ధభగవానుని ఉపదేశములు లోకకల్యాణమునకు తోడ్పడును. అహింసా మూర్తియైన బుద్ధభగవానునకు వేలకొలది వందనములు.

**శ్లో॥ బుద్ధం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి.**



Scanned with CamScanner




Scanned with CamScanner

# 10. కల్క్యవతారము

మనపురాణములలోను, ధర్మశాస్త్రములయందును 'కల్కి అవతారము' శ్రీమహావిష్ణువుయొక్క పదవ అవతారముగా తెలుపబడినది. కలియుగమున క్రమక్రమముగా ధర్మము, సత్యము, పవిత్రత, క్షమ, దయ, ఆయువు, బలము మున్నగునవి సమాజమున క్షీణించుచుండునని శాస్త్రములు తెలిపినవి. కలియుగమున ధనవంతుడే, ఉత్తమవంశమువాడు, సదాచారము గలవాడు, సద్గుణవంతుడు అని తలంపబడును. మోసము చేయుటయందును, కపటమునందును ఆఁతేఁనవాడే వ్యవహారదక్షుడుగా పరిగణింపబడును. గుణస్వభావములు ఎటువంటివైనను 'జందెము'ను కలిగియున్నచో అతనిని ఈలోకము బ్రాహ్మణునిగా గుర్తించును. దంభాచారులు, నాస్తికులు సత్పురుషులుగా భావింపబడుదురు. ధర్మకార్యములను పేరుప్రతిష్ఠలకొఱకుమాత్రమే జరుపుచుందురు.

ప్రపంచమునందు అంతయును దుష్టులపరిపాలనమే సాగుచుండును. రాజు (పరిపాలకుడు) అగుటకు ఎట్టి నియమములు అక్కఱలేదు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రాదులలో బలముగలవాడే రాజగును. నీచులు రాజులై, మిక్కిలిక్రూరులు, దయలేనివారు అగుదురు. వారికి భయపడి జనులు కొండలకు, కోనలకు పాఱిపోవుదురు. కలియుగమున కఱవుకాటకములు ఎక్కువగును. ఆకలిదప్పులచే, ఇతర చింతలచే ప్రజలు దుఃఖములపాలగుదురు. వారు ఆకులలములుతిని పొట్టనింపుకొందురు. జనులు దొంగతనములు, హింసమొదలగు అకృత్యములకు పాల్పడుచు జీవితములను గడుపుచుందురు.

కలికాలపుదోషములవలన ప్రాణులశరీరములు కురుచ అగును. అన్నివర్ణములవారును శూద్రులవలె వ్యవహరింతురు. గోవులు బక్కచిక్కి మేకలవలె పాలను తక్కువగానిచ్చును. వానప్రస్థులు, సన్న్యాసులు గృహస్థులవలె జీవింతురు. జనులు ధర్మశాస్త్రములను గేలిచేయుదురు. వేదములను, పురాణములను నిందింతురు. పూజలుచేయుట, పవిత్రగ్రంథములను పఠించుట వ్యర్థములని తలంతురు. ధర్మ కార్యములయందు ఆడంబరములే ముఖ్యములగును. ఈవిధముగా కలియుగము ముగియునప్పటికి భూమండలమున హింసాప్రవృత్తి, జాతీయసంఘర్షణలు మితిమీఱును. ఇట్టిస్థితిలో ధర్మమును స్థాపించుటకై భగవంతుడు అవతరించుచుండును.

కలియుగాంతమున 'శంభరము' అను గ్రామమున విష్ణుయశుడు అను పేరుగల ఒక ఉత్తమ బ్రాహ్మణుడు ఉండును. అతడు గొప్ప ఉదారహృదయము గలవాడు. భగవంతునకు పరమభక్తుడు. అతని ఇంటిలో 'కల్కిభగవానుడు' అవతరించును. ఆయన 'దేవదత్తము' అను పేరుగలగుఱ్ఱమును ఎక్కి, తన ఖడ్గముచే దుష్టులను సంహరించును. భూమండలమున అడుగంటిన ధర్మమును మఱల ఉద్ధరించును. భగవంతుడు కల్కి అవతారమును ఎత్తినప్పటినుండియు సత్యయుగము ప్రారంభమైనదని తలంపవచ్చును. అప్పటినుండియు ప్రజలు సుఖశాంతులతో జీవింతురు. ఈ విషయములన్నియు శాస్త్రములలో తెలుపబడినవి.

చరాచరజగత్తునకు స్వామియైన కల్కిభగవానునకు అనేకప్రణామములు.



Scanned with CamScanner




Scanned with CamScanner



## నవదుర్గ

ఆదిశక్తి, త్రిపురసుందరి, పరాశక్తి మొదలైన దుర్గాదేవి యొక్క తొమ్మిది విధములైన స్వరూపములను చక్కగా వివరించెడి పుస్తకమిది. ఈ పుస్తకములో దుర్గాదేవి నవవిధ స్వరూపములను ధరించు వృత్తాంతములు, ఆయా స్వరూపములను ఉపాసించు విధులు, వానివలన లభించు ఫలితములు మొదలైనవన్నియును అత్యంతసరళమైనభాషలో చిన్నపిల్లలకు అర్థమగునట్లు వర్ణింపబడినవి. దీనిలో దుర్గాదేవియొక్క తొమ్మిదిస్వరూపములను అతిసుందరము, ఆకర్షణీయమైన బహువర్ణచిత్రాలలో ఇచ్చుట జరిగినది. దీనిని చదివినా, చిత్రములను చూచినా చిన్నపిల్లలకు భక్తిభావనతోపాటు ధార్మికతత్త్వము కూడ అలవడును.



## శ్రీరామచంద్రుడు

శ్రీరామచంద్రునిపవిత్రమైనచరిత్రమును తెలుపుచిత్ర కథావళిలో ఇది రెండవది. ఈ చిన్నిపుస్తకములో శ్రీరామచంద్రుడు విశ్వామిత్రునివెంటపోవుట, తాటకను సంహరించుట, యజ్ఞమును కాపాడుట, ఉద్యానవనములో రామలక్ష్మణులు విహరించుట, సీతాస్వయంవరమున లక్ష్మణుడు కోపించుట, పరశురామ లక్ష్మణుల సంవాదము మంథర దురాలోచన, లక్ష్మణునకు సుమిత్రఉపదేశము, పడవవానిఅదృష్టము, సుమంత్రుడు అయోధ్యకు తిరిగివచ్చుట మొదలైన పదునేడు సుందరమైన విషయములున్నవి. ప్రతికథవెంట ఆ కథకు సంబంధించిన అందమైనచిత్రములు ఈ చిరుపొత్తమునకు ప్రత్యేక ఆకర్షణలు. చిన్నపిల్లలకు మంచినడవడిక కలిగించుటకు ఉపయోగించు శ్రీరామచంద్రుని దివ్యలీలలను ఈ పుస్తకము చక్కగా వర్ణించును. ఇది చిన్నపిల్లలతోపాటు పెద్దవారుకూడ తప్పక చదువవలసిన పుస్తకము.


*రచన :- డా॥ యం. కృష్ణమాచార్యులు*

*డా॥ గోలి వేంకటరామయ్య*



GPPN 965

First Edition 2006 10,000 Copies

**Price : Ten Rupees**

Printed & Published by **Gita Press, Gorakhpur—273005 (INDIA)**

(a unit of Gobind Bhavan-Karyalaya, Kolkata) ✆ (0551) 2334721; Fax 2336997



website:**www.gitapress.org** e-mail:**booksales@gitapress.org**



Scanned with CamScanner